క్లుప్తంగా

కార్తీక వన సమారాధనకు రావాలని ఆహ్వానం



గ్రంథాలయ చైర్మన్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సూర్యాపేటటౌన్ : ఆత్మకూరు (ఎస్) మండలంలోని పాత సూర్యాపేట స్టేజి వద్ద గల శ్రీసంతోషిమాత ఉద్యానవన క్షేత్రంలో ఈనెల 24న నిర్వహించే కార్తీక వన సమారాధన మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ బుధవారం పట్టణంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావుకు శ్రీసంతోషిమాత దేవాలయ కమిటీ సభ్యులు ఆహ్వానపత్రం అందజేశారు. కార్యక్రమంలో దేవాలయం ఉపాధ్యక్షుడు పబ్బా ప్రకాశరావు, సహాయ కార్యదర్శి తాళ్లపల్లి రామయ్య ప్రోగ్రాం కన్వీనర్ గోపారపు రాజు, భక్తుడు గుడిపాటి రమేష్, దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం ఉన్నారు.

రజక ఫిషర్‌మెన్ సొసైటీ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్



శ్రీనివాస్‌కు నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర రజక సంఘం నాయకులు

తుంగతుర్తి : మండల కేంద్రానికి చెందిన పూసపల్లి శ్రీనివాస్‌ను రజక ఫిషర్‌మెన్ సొసైటీ జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ ఆ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆమనగంటి సైదులు బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. జీఓ 33ప్రకారం రజకులకు చెరువులు కేటాయించాలని కోరారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని, తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు సైదులు, ప్రధాన కార్యదర్శి నర్సయ్య, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయ రాములు

తిరుమలగిరి : మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో సీసీరోడ్డు నిర్మాణ పనులకు బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో దశల వారీగా సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, సుంకరి జనార్దన్, రాముగౌడ్, వేణురావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు వడిబియ్యం



వడిబియ్యం, మంగళహారతులతో పూజలు చేస్తున్న మహిళలు

అర్వపల్లి: కార్తీకమాసం సందర్భంగా అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో బుధవారం భక్తులు రాజ్యలక్ష్మి, గోదాదేవి అమ్మవార్లకు వడిబియ్యం సమర్పించారు. అలాగే మంగళహారతులతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, మహిళా భక్తులు పాల్గొన్నారు.

సత్యనారాయణరెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు



మృతుడి కుటుంబాన్ని ఓదార్చుతున్న మల్లు లక్ష్మి

నూతనకల్లు : సీపీఎం సీనియర్ నాయకుడు కట్ట సత్యనారాయణరెడ్డి మృతి పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మీ అన్నారు. బుధవారం మండలంలోని చిల్పకుంట్ల గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డి మృతి చెందారు. ఆయన మృతదేహంపై పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. ఆమె వెంట పార్టీ మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి, సామ వెంకట్‌రెడ్డి, తోట్ల లింగయ్య, సామ సురేందర్‌రెడ్డి, సైదులు, తిరుమలేష్, లక్ష్మయ్య ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నూతనకల్లు : సంక్షేమ వసతిగృహాల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పులూరి సింహాద్రీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీసీ వసతిగృహంలో విద్యార్థులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్సిడీ టార్పాలిన్లు ఏవీ?

- ఐదారేళ్లుగా పంపిణీని నిలిపివేసిన ప్రభుత్వాలు
- అకాల వర్షాలకు తడుస్తున్న ధాన్యం
- అద్దెలతో ఇబ్బందులు పడుతున్న రైతులు

అర్వపల్లి : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అకాల వర్షాలకు కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో అకాల వర్షాలు కురుస్తున్నందున కల్లాల్లో ధాన్యం తడుస్తుండడంతో తీవ్రంగా నష్టపోవాల్సివస్తుంది. ఐదు సంవత్సరాల నుంచి ప్రభుత్వం సబ్సిడీ టార్పాలిన్ల పంపిణీ నిలిపివేయడంతో బహిరంగ మార్కెట్‌లో టార్పాలిన్లు అధిక ధరలకు అమ్ముతుండడంతో వాటిని కొనలేక కొంతమంది రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. చేసేదిలేక పలువురు రైతులు ఎరువుల బస్తాలతో పట్టాలు కుట్టించుకోని ధాన్యం తడవకుండా కాపాడుకుంటున్నారు. గతంలో ప్రభుత్వాలు రైతులకు 50శాతం సబ్సిడీపై టార్పాలిన్లను సరఫరా చేసింది. దీంతో రైతులు పంటలు కోసిన సమయంలో ఈ టార్పాలిన్లను వినియోగించుకునేవారు.

20వేల ఎకరాలకు పైగానే సాగు..

జాజిరెడ్డిగూడెం మండలంలో ప్రతి సీజన్‌లో 20వేల ఎకరాలకు పైగానే వరి పంట సాగవుతుంది. సుమారు 7వేల మంది రైతులు పంటలు పండిస్తున్నారు. ఈ సీజన్‌లో మండల వ్యాప్తంగా 22ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. సీజన్‌లో 3.80లక్షల క్వింటాల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారుల అంచనా. అయితే ఈసీజన్‌లో ఇప్పటి వరకు మూడుసార్లు అకాల వర్షాలు కురిశాయి. దీంతో కేంద్రాలతో పాటు కల్లాలలో పోసిన ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. రైతులు సబ్సిడీ టార్పాలిన్లు రాక మొత్తం ధర చెల్లించి బయట దుకాణాలలో కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న రైతులు టార్పాలిన్లను తాత్కాలికంగా అద్దెకు తీసుకుంటున్నారు. దీంతో వారిపై అదనపు భారం పడుతుంది. బయట రూ.2నుంచి రూ.3వేల వరకు అద్దె చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సబ్సిడీపై టార్పాలిన్లను అందజేయాలని రైతులు కోరుతున్నారు.



వేల్పుచర్ల కేంద్రంలో ధాన్యం రాశులపై రైతులు అద్దెకు తెచ్చుకొని కప్పుకున్న బస్తాలు

సబ్సిడీ టార్పాలిన్లు అందించాలి



గతంలో 50శాతం సబ్సిడీపై టార్పాలిన్లను ప్రభుత్వం అందించేది. కొంత కాలంగా సబ్సిడీ టార్పాలిన్లను ఇవ్వడం లేదు. దీంతో బయట కొనుగోలు చేయాలంటే ఆర్థికంగా ఇబ్బంది ఏర్పడుతుంది. అద్దెకు తీసుకుంటే భారంగా మారుతుంది. ప్రభుత్వం సబ్సిడీ టార్పాలిన్లను తిరిగి అందించాలి.

– సుంకరి వెంకన్న, రైతు

ప్రభుత్వం నుంచి వస్తే అందిస్తాం



కొంతకాలంగా సబ్సిడీ టార్పాలిన్ల పంపిణీని ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో రైతులకు అందించలేకపోతున్నాం. ప్రభుత్వం నుంచి వస్తే రైతులకు వెంటనే అందజేస్తాం. కొనుగోలు కేంద్రాల ఆధ్వర్యంలో కొంత మేర టార్పాలిన్ల ఏర్పాటు చేస్తున్నాం.

– పి.గణేష్, మండల వ్యవసాయ అధికారి

గత ప్రభుత్వంలో ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం

తుంగతుర్తి: గత ప్రభుత్వంలో ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం అన్నారు. బుధవారం మండల పరిధిలోని అన్నారం గ్రామంలో సీఎస్‌ఐ చర్చి ప్రారంభోత్సవానికి ఆయన హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ గత పది సంవత్సరాల కాలంలో ఒక్క దళితుడికి కూడా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లోన్లు ఇప్పించిన పాపాన పోలేదని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత కరెంట్‌ను ఇచ్చిన ఘనత రేవంత్ రెడ్డిదే అని అన్నారు. ప్రతి యూనివర్సిటీలో స్కిల్ డెవలప్‌మెంట్ పెట్టి యువత అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు. గాదరి కిషోర్‌కుమార్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే బీఆర్‌ఎస్ పార్టీని నామరూపాలు లేకుండా చేస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, మిట్టగడుపుల అశోక్, చింతకుంట్ల వెంకన్న, తప్పట్ల శంకర్, దాసరి శ్రీను, కలకోట్ల మల్లేష్, కొండ రాజు, మాచర్ల అనిల్, మిరియాల నాగయ్య, మంగళపల్లి నాగరాజు, పోలేపాక అంజయ్య, వంగాల దాసు, మిర్యాల జనార్దన్, మిరియాల శ్రీను, చింతకుంట్ల హరీష్, మడిపెద్ది నవీన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం

ఉద్యమాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం

నాగారం : ఉద్యమాలను బలోపేతం చేయడంతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పసునూరు గ్రామంలో నిర్వహించిన పార్టీ తుంగతుర్తి డివిజన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో పీడిత ప్రజానికం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వ ఫాసిస్ట్ విధానాల మూలంగా ప్రజల మధ్య చీలికలు వచ్చి అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సాకులు చెప్పకుండా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. అనంతరం డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ నూతన కార్యదర్శిగా పేర్ల నాగయ్య, సహాయ కార్యదర్శిగా గొడ్డలి నర్సయ్య, సభ్యులుగా వేర్పుల లక్ష్మయ్య, వేర్పుల పరుశురాం, కందుకూరి కొండయ్య, ఇద్దరిని కోఆప్షన్ సభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో పార్టీ డివిజన్ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, నాయకులు మామిడి సుధాకర్, సూరారపు మల్లేష్, పెరుమల్ల భాస్కర్, రాయల రాజ్‌కుమార్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

అమరవీరుల త్యాగాలు వృథా కావు




సమావేశంలో మాట్లాడుతున్న డేవిడ్‌కుమార్

తిరుమలగిరి : అమరవీరుల త్యాగాలు వృథా కావని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన అమరవీరుల సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం నక్సలైట్ ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతుందన్నారు. నక్సలైట్ ఉద్యమం ప్రజల సమస్యలతో ముడిపడి ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.కిరణ్, సంజీవ, అంజయ్య, సామేల్, లింగయ్య, కొండయ్య, యాదగిరి, పరశురామ్, సింహాద్రి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుకు ప్రాముఖ్యత ఇవ్వాలి

అర్వపల్లి : విద్యార్థులు చదువుకు ప్రాముఖ్యత ఇవ్వాలని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత, రచయిత, సమాజసేవకుడు డాక్టర్ పెండెం కృష్ణకుమర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొమ్మాల జెడ్పీహెచ్‌ఎస్‌లో దేశనాయకులు, శాస్త్రవేత్తల చిత్రపటాలు, మెడికల్ కిట్, వాటర్ క్యాన్, ఆట వస్తువులు, వివిధ రకాల మ్యాపులు, విద్యార్థులకు బ్యాగులు, క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. అలాగే ఉపాధ్యాయులకు క్లాత్ బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా 333 పాత్రలతో హిస్టారికల్, మైథాలాజికల్, సోషల్, ఫ్రీడం ఫైటర్స్, స్త్రీ, పురుష అన్నిరకాల పాత్రలలో నటించి గిన్నీస్‌బుక్ ఆఫ్ వరల్డ్ నాలుగు సార్లు అవార్డులు పొందిన కృష్ణకుమార్‌ను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బండారి శేఖర్, ఉపాధ్యాయులు భాస్కర్, స్నేహలత, పర్వతం సంధ్యారాణి, సూర్య, హరీష్, మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాఠశాలకు ఆట వస్తువులు,చిత్రపటాలు అందజేస్తున్న డాక్టర్ కృష్ణకుమార్

కోర్టు ఉత్తర్వులు హర్షణీయం

భానుపురి (సూర్యాపేట) : కమ్యూటేషన్ ఆఫ్ పెన్షన్‌ను 15ఏళ్ల నుంచి 11సంవత్సరాలకు తగ్గించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.సీతారామయ్య, జిల్లా అధ్యక్షుడు ఎస్.సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కోర్టు ఉత్తర్వులతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరికీ సీపీసీని నిలుపుదల చేయాలని రాష్ట్ర హైకోర్టు ఇంటీరియల్ ఆర్డర్స్ ఇచ్చిందని, దీనిపై ఎవరూ కోర్టుకు వెళ్లకుండా ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని తెలిపారు.

సభను జయప్రదం చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

పెన్‌పహాడ్ : సూర్యాపేటలో ఈనెల 26న నిర్వహించే టీఎమ్మార్పీఎస్ విజయోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ సమితి జిల్లా అధ్యక్షుడు కత్తి ఉపేందర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ధర్మాపురం, మహ్మదాపురం గ్రామాల్లో సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మాదిగ ఉపకులాలు వేలాదిగా తరలివచ్చి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఒగ్గు వెంకన్న, జిల్లా కార్యదర్శి మామిడి సైదులు, మండల అధ్యక్షులు దేవయ్య, నగేష్, సైదులు, శ్రీనివాస్, గోపి, విక్రం ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

సూర్యాపేట టౌన్: నల్లగొండలో ఈనెల 23న నిర్వహించనున్న మాదిగల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి, పట్టణ ఇన్‌చార్జ్ బొజ్జ సైదులు మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో చింత వెంకన్న, చెరుకుపల్లి అర్జున్, బోడ నాగరాజు, గుండ్లపల్లి సాయి, బొజ్జ సుమన్, ఉపేందర్, మహేష్ పాల్గొన్నారు.

అర్వపల్లి : నల్లగొండలో ఈనెల 23న నిర్వహించే మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పూలే-అంబేద్కర్ ఆశయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలో సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. ఆత్మీయ సమ్మేళన సభకు మాదిగలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు.

విద్యార్థులకు తాగునీరు అందించడం అభినందనీయం

నూతనకల్ : పాఠశాలల్లోని విద్యార్థులకు దాతలు తాగునీరు అందించడం అభినందనీయమని పాఠశాల హెచ్‌ఎం విద్యాసాగర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఇమ్మారెడ్డి రాజాబహుదూర్‌రెడ్డి తన సొంత ఖర్చులతో ఒక సంవత్సరం పాటు రక్షిత మంచినీటిని అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా దాతను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

పెన్‌పహాడ్ : సూర్యాపేటలో ఈనెల 29, 30, డిసెంబర్ 1వతేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి గుంజా వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని చీదేళ్ల, తంగేళ్లగూడెం గ్రామంలో జిల్లా మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఈనెల 29న సూర్యాపేటలో భారీ ర్యాలీతో గాంధీ పార్కులో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభకు వివిధ ప్రాంత రైతులు, వ్యవసాయ కూలీలు గీత కార్మికులు, హమాలీలు, ఉద్యోగులు, మేధావులు సబ్బండ వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు మడ్డి అంజిబాబు, కొండమిది రాములు, నాయకులు గుర్రం గోపాల్‌రెడ్డి, చందా లింగయ్య, జంగిలి చంద్రయ్య, రామారావు, వెంకన్న, కాశయ్య, గోపయ్య పాల్గొన్నారు.

అన్నప్రసాదం వితరణ

సూర్యాపేట : పట్టణంలోని విద్యానగర్‌లో గల శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం 300మంది అయ్యప్పస్వాములకు, అదే విధంగా అన్ని మాలధారణ స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నప్రసాద వితరణ కార్యక్రమం అమెరికాలో స్థిరపడిన మహబూబాబాద్ జిల్లా గున్నేపల్లి గ్రామానికి చెందిన కొంపెల్లి అనిల్‌రెడ్డి, ఆశ్రిత, స్నేహిత్‌రెడ్డి, ఉషారాణి కుటుంబ సభ్యులు నాలుగు సంవత్సరాలుగా మిత్రుడి సహకారంతో చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కక్కునూరు వేణుగోపాలరావు, వాసవి, లక్ష్మీకౌశల్, లక్ష్మీకీర్తన పాల్గొన్నారు.

చివ్వెంల : మండలంలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన రెవెన్యూ ఉద్యోగి షేక్ బాలసైదా బుధవారం గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గురుస్వామి గోగుల ఈదయ్య, శ్రీనివాస్, మల్సూర్, సందీప్ పాల్గొన్నారు.

బియ్యం అందజేత

పెన్‌పహాడ్ : మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన నెమ్మాది సైదులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం మృతుడి కుటుంబానికి గ్రామానికి చెందిన భవానీ కమిటీ సభ్యులు పరామర్శించి 50కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో గురుస్వామి, తాడూరి లింగయ్య, చెవుగాని అంజయ్య, సతీష్, శ్రీనయ్య, పరుశ రాములు, సాయి, జానయ్య, లింగయ్య ఉన్నారు.

నూతనకల్లు : మండల పరిధిలోని ఎడవెల్లి గ్రామానికి చెందిన బయ్యా మల్లయ్య ఇటీవల మృతి చెందాడు. బుధవారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గాజుల తిరుమల్‌రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం క్వింటా బియ్యాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు బయ్యా వీరయ్య, తూముల వెంకటేశ్వరావు, బయ్యా లింగయ్య, ఉపేందర్, వెంకన్న పాల్గొన్నారు.

అన్ని వర్గాలను మోసం చేస్తున్న సీఎం

- మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

తుంగతుర్తి : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అన్నారం గ్రామంలో సీఎస్‌ఐ చర్చీ ప్రారంభోత్సవం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ జాతిపిత లాంటి కేసీఆర్‌ను తెలంగాణలో లేకుండా చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ సభలో అనడం ఎంత వరకు సమంజసమన్నారు. కేసీఆర్‌ను లేకుండా చేసే అంత దమ్ముందా అని, ఓటుకు నోటు కేసులో పట్టుబడి జైలుకెళ్లిన దొంగ రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. తులసివనంలో గంజాయి మొక్క లాంటోడు రేవంత్‌రెడ్డి అని, కేసీఆర్ కంటే గొప్పగా చేస్తావని పొరపాటున నమ్మి గెలిపిస్తే ప్రజల రక్తాన్ని తాగుతున్నాడని అన్నారు. ఏడాది కాలంలోనే కాంగ్రెస్ పాలనపై ప్రజలు సావును, దినాలు కోరుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏడాది కాలంలో సీఎం రేవంత్‌రెడ్డి పెట్టిన ఏ సభలోనైనా కేసీఆర్‌ను తిట్టకుండా పెట్టిన సభ లేదన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయని దుర్మార్గపు పాలన రేవంత్‌రెడ్డి చేస్తున్నాడని అన్నారు. నియోజకవర్గంలో గతంతో పోలిస్తే వరి దిగుబడి తగ్గిందన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో 150కి.మీకు రూ.1లక్ష 50వేల కోట్లు కేటాయించడం కాంగ్రెస్ చేస్తున్న అవినీతికి, దోపిడీకి నిదర్శనమన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, గుండగాని రాములు, కల్లెట్లపల్లి ఉప్పలయ్య, సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, దొంగరి శ్రీనివాస్, దుర్గాయ్య, సోమశేఖర్, నాగమల్లు, దాసు, రాములు, సైదులు, వెంకన్న, శ్రీను తదితరులు ఉన్నారు.

బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

సూర్యాపేటటౌన్ : చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ వీరబోయిన లింగయ్యయాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 25న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే బీసీల సమర భేరి సభను విజయవంతం చేయాలని కోరుతూ సభకు సంబంధించిన పోస్టర్లను బుధవారం పట్టణంలోని మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహ వద్ద ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్ల గడిచినా బీసీలు రాజ్యాధికారం సాధించడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. దేశానికి బీసీ ప్రధాన మంత్రి ఉండి కూడా బీసీలకు న్యాయం జరగకపోవడం శోచనీయమన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ తీసుకొచ్చి బీసీలకు తీవ్ర అన్యాయం చేశారని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ రద్దు చేయాలని కోరారు. కేంద్రంలో ప్రత్యేక మంత్రుత్వ శాఖ ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా బీసీ ఉద్యోగులకు ప్రమోషన్‌లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జనసేవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తగుల జనార్దన్, కొల కర్ణాకర్, పోలోజు మహేశ్ చారి, పరాల సాయికుమార్‌యాదవ్, రమేష్‌కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన సదస్సు

పెన్‌పహాడ్ : గృహిణిలు ఇంటి వద్దనే ఆదాయం పొందవచ్చని హోమ్ సైన్స్ శాస్త్రవేత్త ఎన్.సుగంధి అన్నారు. బుధవారం మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యకరమైన పోషక ఆహార ప్రాముఖ్యతను వివరించారు. అదే విధంగా మల్టీ విటమిన్ పొడిని పంపిణీ చేసి మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడంపై వివరించారు. అనంతరం మల్లారెడ్డి వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులు పోస్టర్లు రూపొందించి ఇంటి వద్దనే ఆదాయం పొందగల అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు దీలేన, స్నేహ, దివ్యశ్రీ, గీతిక, లలిత, దుర్గశ్రీ, హృతిక, కీర్తన తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థులు

అంగన్‌వాడీ కేంద్రాల విలీనం ఆపాలని వినతి



ఇన్‌చార్జ్ సీడీపీఓకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, నాయకులు

భానుపురి (సూర్యాపేట) : అంగన్‌వాడీ కేంద్రాలను విలీనం చేయడాన్ని వెంటనే ఆపాలని అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంపటి గురుజీ అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ఇన్‌చార్జ్ సీడీపీఓ విజయచంద్రికకు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కొన్ని కేంద్రాలలో చిన్నారులు ఎక్కువగా లేరనే సాకుతో సమీపంలోని వార్డ్ అంగన్‌వాడీ కేంద్రాలలో విలీనం చేయడంతో ప్రస్తుతం నిర్వహిస్తున్న కేంద్రాల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.24వేలు, హెల్పర్స్ రూ.21వేల వేతనం పెంచాలన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తంతెనపల్లి సుజాత, ఉపాధ్యక్షురాలు గుండగాని సుజాత, చంద్రకళ, రేఖ, మాధవి, ఉష, సైదమ్మ, సునంద, భాగ్యలక్ష్మి, జానకమ్మ, జహంగీర్ బీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మారయ్య అన్నారు. ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంతో పాటు, వర్ధమానుకోట, ఫణిగిరి గ్రామాల్లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే ప్రజలకు ఆరు గ్యారంటీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని అన్నారు. అనంతరం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తమ ఆట, పాటలతో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారథి టీం లీడర్ ఈర్ల సాయి, గడ్డం ఉదయ్, వెన్నెల నాగరాజు, పాలకుర్తి శ్రీకాంత్, మాగి శంకర్, పాక ఉపేందర్, మేడిపల్లి వేణు, గజ్జి మంజుల, సిరిపాంగి రాధ, మల్లెపాక శిరీష, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాజాత సభ్యులు

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ఐలయ్య

నాగారం : మండల కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ఎం.ఐలయ్య పాల్గొని మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, స్థానిక ప్రజలు గంజాయి, కొకైన్, హెరాయిన్, నల్లమందు, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాలు విక్రయించే ప్రదేశాల గురించి, మాదకద్రవ్యాలు వినియోగించే వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే 100 నంబర్‌కు, 1093కి సమాచారం తెలియజేయాలన్నారు. విద్యార్థులు, యువకులు మత్తు, మాదకద్రవ్యాలను వినియోగించి ఆరోగ్యం, భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, తల్లిదండ్రులను, కుటుంబాలను నష్టాలపాలు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఎల్లయ్య, రవీందర్, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



మద్దిరాల : కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ అమీన్‌సింగ్

మద్దిరాల : రైతులు కొనుగోలు కేంద్రాలకు ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకురావాలని తహసీల్దార్ అమీన్ సింగ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కుక్కడం, రామచంద్రపురం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ఆయన వెంట వీబీకే అంజయ్య, రైతులు ఉన్నారు.



అర్వపల్లి : అడివెంల కేంద్రంలో ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న ఏఈఓ సత్యం

అర్వపల్లి : మండల పరిధిలోని అడివెంల గ్రామ ఎన్‌డీసీఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం తిమ్మాపురం క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి నేరెళ్ల సత్యం సందర్శించారు. అనంతరం ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలించారు. 17శాతం లోపు తేమ ఉంటే వెంటనే కాంటా వేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట కేంద్రం ఇన్‌చార్జ్ ఆవుల విక్రం, రైతులు రమేష్, లింగయ్య ఉన్నారు.